క్లుప్తంగా...

ఎస్‌జీఎఫ్‌ఐ జోనల్ స్థాయి క్రీడలు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, మేడిపల్లి మండలాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల అండర్ 14, 17 బాలబాలికలకు ఈ నెల 11–13 వరకు ఎస్‌జీఎఫ్ఐ జోనల్ స్థాయి క్రీడలు పట్టణంలోని గురుకుల్ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు జోనల్ సెక్రటరీ శ్రీరాములు తెలిపారు. 11న వాలీబాల్, 12న ఖోఖో, 13న కబడ్డీ క్రీడలు ఉంటాయని ఆయ క్రీడలను అనుసరించి అదే రోజున హాజరు కావాలన్నారు. స్కూల్ బోనాఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరి తేవాలని, అదనపు సమాచారం కోసం ఫోన్: 96405 01084, 98495 90306, 89789 04097.

బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న సుధాకర్‌రెడ్డి



దరఖాస్తు చేసుకుంటున్న సుధాకర్‌రెడ్డి

మేడ్చల్: మేడ్చల్ బీజేపీ టికెట్ తనకు కేటాయించాలని కోరుతూ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు బీజేపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఆయన నగరంలోని బీజేపీ కార్యాలయానికి వెళ్లి తన బయోడేటాను జతపరిచి మేడ్చల్ బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

జగన్‌గౌడ్ దరఖాస్తు..



దరఖాస్తు పత్రం అందజేస్తున్న జగన్‌గౌడ్

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిత్వం కోసం బుధవారం మండలంలోని ఎల్లంపేట్ గ్రామానికి చెందిన జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్ దరఖాస్తు చేసుకున్నారు. మేడ్చల్ మున్సిపల్, మండల నాయకులతో కలిసి రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి వెళ్లిన జగన్‌గౌడ్ ఈ మేరకు మేడ్చల్ టికెట్ ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలంయాదవ్, ప్రేమ్‌దాస్, రాఘవరెడ్డి, శ్రీనివాస్, రాజేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ మాసోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, మేడ్చల్ జిల్లా: పోషణ్ మాసోత్సవం పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లో వాల్‌పోస్టరును జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా జరిగే పోషణ మాసోత్సవాలను షెడ్యూల్ ప్రకారం చేపట్టి, విజయవంతం చేయాలన్నారు. జిల్లా అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి, ఉద్యోగులు, శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట కాంట్రాక్టు ఉద్యోగుల దీక్షలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఉద్యోగ భద్రత, మినిమం టైం స్కేల్ కోసం బుధవారం కలెక్టరేట్ ఎదుట కాంట్రాక్టు ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలు ఈనెల 10 వరకు కొనసాగనున్నట్లు వారు తెలిపారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని కాంట్రాక్టు ఉద్యోగులు హెచ్చరించారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం మేడ్చల్ జిల్లా జేఏసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేయాలని కోరారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. పోషక వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ టీచర్ శ్రీలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు తల్లులతో కలిసి అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పోషకాలపై అవగాహన కల్పించారు.

గొర్రెల పంపిణీ లక్ష్యం పూర్తయ్యేనా..?

గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిన సర్కారు

- మొదటి విడతలో గొర్రెల పంపిణీ సజావుగానే సాగినా.. రెండో విడతలో నత్తనడక
- 1296 యూనిట్ల గొర్రెల పంపిణీకి.. చేసింది 90 యూనిట్లు మాత్రమే..



ఫైల్

సాక్షి, మేడ్చల్ జిల్లా: గొర్రెల పెంపకాన్ని ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్న గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోంది. 2017 సంవత్సరంలో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని పరిశీలిస్తే.. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గొర్రెల పంపిణీ కార్యక్రమం పూర్తవుతుందా లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొదటి విడతలో గొర్రెల యూనిట్ల పంపిణీ సజావుగానే సాగినా.. రెండో విడతలో మాత్రం నత్తనడకన సాగుతోంది. ప్రభుత్వం ఈ ఏడాది జూన్‌లో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి.. రెండు నెలలు పూర్తయినా పథకం అమలులో వేగం తగ్గినట్లు కనిపిస్తోంది. దీనికి తోడు గొర్రెల పంపిణీ పథకానికి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) రుణం అందించేందుకు విముఖత చూపడంతో అమలు ఆలస్యమైనట్లు తెలుస్తోంది. దీనికి తోడు ఎన్నికలు సమీపిస్తుండటంతో (ఎన్నికల కోడ్ అమలులోకి రాక ముందే) గుర్తించిన లబ్ధిదారులకు త్వరగా అందించేందుకు ప్రభుత్వం ఇతర ఆర్థిక సంస్థలు, బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని పథకాన్ని వేగవంతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో లబ్ధిదారుల్లో కొత్త ఆశలు చిగురించాయి.

లబ్ధిదారుల పడిగాపులు

ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టింది. మేడ్చల్ జిల్లాలో గొర్రెల పంపిణీ పథకం కింద మొత్తంగా 5,160 మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. మొదటి విడతలో దశలవారీగా 3,864 మందికి గొర్రెల యూనిట్లను అందజేశారు. ఒక్కో యూనిట్లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు చొప్పున పంపిణీ చేశారు. రెండో విడతలో కూడా కొంత మందికి అప్పట్లోనే గొర్రెలు అందజేశారు. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేక పోవడంతో గొర్రెల పంపిణీ నిలిచిపోయింది. మళ్లీ ఈ పథకాన్ని కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం రెండు నెలల కిందట ప్రకటించడంతో.. ఇంకా మిగతా 1296 మంది లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వీరిలో 102 మంది లబ్ధిదారులు డీడీలు చెల్లించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా నుంచి తెప్పించిన గొర్రెలను ఇప్పటి(బుధవారం) వరకు 90 మందికి అందజేశారు. మిగిలిన లబ్ధిదారులకు సత్వరమే అందజేసేందుకు జిల్లా పశుసంవర్ధక శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

పకడ్బందీగా చర్యలు..

ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేసేలా పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారుల కుల, ఆధార్, బ్యాంకు, నామినీ పత్రాల సేకరణను పూర్తి చేశారు. ఒక వేళ లబ్ధిదారుడు చనిపోతే.. నామినీగా ఉన్న భార్య లేదా కుమారులకు పంపిణీ చేసేలా ప్రక్రియను రూపొందించారు. పూర్తి వివరాలను ఈ ల్యాబ్ పోర్టల్లో అప్‌లోడ్ చేస్తున్నారు. పారదర్శకత కోసం జీపీఎస్ విధానం ఉన్న వాహనాల్లోనే గొర్రెలను రవాణా చేస్తున్నారు.

యూనిట్ విలువ పెంపుతో..

గతం విలువతో పోలిస్తే గొర్రెల యూనిట్ ధర పెరిగింది. మొదటి విడత సమయంలో గొర్రెల యూనిట్ రూ.1.25 లక్షలు ఉంది. లబ్ధిదారుల వాటా రూ.31,250 కాగా మిగతా సొమ్మును ప్రభుత్వం భరించింది. ప్రస్తుతం యూనిట్ విలువ రూ.1.75 లక్షలకు చేరింది. దీంతో లబ్ధిదారుల వాటా రూ.43,750కి చేరగా, గతంలో పోలిస్తే రూ.12.500 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. లబ్ధిదారులు తమ వాటా మొత్తాన్ని ఆన్‌లైన్‌లో నేరుగా జమ చేశారు.

పంపిణీ వేగవంతం చేస్తాం..

రెండో విడత లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందించేందుకు కార్యాచరణను వేగవంతం చేశాం. జిల్లాలో 1296 మంది లబ్ధిదారులు ఉండగా.. 102 మంది డీడీలు చెల్లించారు. వీరిలో ప్రస్తుతం 90 మందికి అందించాం. మిగతా వారికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఒకటి, రెండు నెలల్లో లబ్ధిదారులందరికీ గొర్రెలను అందించేలా ప్రభుత్వం దృష్టి సారించింది. నిరంతర ప్రక్రియగా గొర్రెల పంపిణీ పథకం అమలు కానుంది.

– పి.శేఖర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి

స్థానిక పేదలకు ఒక్క డబుల్ ఇల్లు ఇవ్వలేదు

టీపీసీసీ ఉపాధ్యక్షుడు తొటకూరి వజ్రేష్‌యాదవ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జీహెచ్‌ఎంసీ వారు డబుల్ బెడ్ ఇళ్లు నిర్మించి, స్థానికులకు ఒక ఇల్లు కూడా కేటాయించకుండా చిన్నచూపు చూడటంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొటకూరి వజ్రేష్(జంగయ్య) యాదవ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. జిల్లాలోని ప్రభుత్వ స్థలాల్లో వందలాది ఇళ్లు కట్టి, ఇక్కడి పేదలను విస్మరించినా.. స్థానిక కార్మిక మంత్రి మల్లారెడ్డి పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ భూములను కాపాడిన ప్రజలకే న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఒక మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోనే 80 వేల మంది పేదలు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 30 శాతం మంది అర్హులని పేర్కొన్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఎక్కడి నుంచి ఇస్తారో తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో మేడ్చల్‌లో గెలిచేది కాంగ్రెస్ పార్టే అని ఆయన జోస్యం చెప్పారు.

మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ నాకే.. సీఎం రేవంతే..

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తెలిపారు. మేడ్చల్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి తానే పోటీ చేస్తానని, అనుమానమేమీ లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ సామాజిక వర్గానికి టికెట్ కేటాయిస్తే బరిలో ఉంటానని, ఓసీ సామాజిక వర్గానికి ఇస్తే హరివర్ధన్‌రెడ్డి ఉంటారని, మా ఇద్దరికీ కాదని, ఇతరులకు టికెట్ ఇచ్చే అవకాశమేలేదని వజ్రేష్‌యాదవ్ తెలిపారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత వెంకటేష్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, ఘట్కేసర్ మండల్ అధ్యక్షుడు కర్రె రాజేష్, నాగారం మున్సిపాలిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, గుండ్ల పోచమ్మపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆంజనేయులు యాదవ్, పోచారం మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్.రాజు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు తొటకూరి వజ్రేష్‌యాదవ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొటకూరి వజ్రేష్(జంగయ్య) యాదవ్ కోరారు. బుధవారం పీర్జాదిగూడలో మీడియాతో ఆయన మాట్లాడుతూ 15 రోజుల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే కలెక్టరేట్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ కార్యాలయం కోసం స్థలం కేటాయించి నట్లుగానే.. ప్రెస్‌క్లబ్‌లకు స్థలాలు కేటాయించి, భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా మంత్రి మల్లారెడ్డి ఈ విషయాల్లో ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలను కేటాయించి, పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు.

పేదలను ఆదుకునేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: పేదలను ఆదుకునేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, గత ప్రభుత్వాలు వారికి మాటలు చెప్పారే తప్ప చేతల్లో చూపలేదని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం శామీర్‌పేట్, బొమ్మరాశిపేట్ గ్రామాలకు చెందిన 137 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలందరికీ గూడు కల్పించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం, గృహలక్ష్మి, ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు పట్టాలు ఇచ్చారే తప్ప స్థలం చూపించలేదన్నారు. గతంలో పట్టాలు ఉన్న వారికి కొత్త పట్టాలు పంపిణీ చేసి వారికి స్థలం కేటాయిస్తున్నట్లు తెలిపారు. పేదలకు పట్టాలతో పాటు గృహలక్ష్మి పథకంలో రూ.3 లక్షల సాయం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. తాను పేదల పక్షపాతిగా వ్యవహరిస్తుంటే కాంగ్రెస్ వారు పట్టాలు పంపిణీ చేయకుండా అడ్డుకునేందుకు యత్నించడం ఏంటన్నారు. పేదల అభ్యున్నతికి తాము పాటుపడుతుండే వారు పేదలుగానే ఉండాలని కాంగ్రెస్ వాళ్లు చూస్తున్నారని మండిపడ్డారు. వారం రోజుల్లో నియోజకవర్గంలోని 3 వేల మందికి గృహలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 1100 మందికి దళితబంధు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఉప్పర్‌పల్లిలో కూడా పట్టాలను పంపిణీ చేసే బాధ్యత నాదే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లుబాయి, సర్పంచ్ బాలమణి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుదర్శన్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో..



కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్ కుటుంబసమేతంగా బుధవారం తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఏపీ టూరిజం శాఖ మంత్రి రోజాను మర్యాదపూర్వకంగా కలిశారు.

మేడ్చల్ నియోజకవర్గంలో రౌడీల రాజ్యం

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: దరఖాస్తు చేసుకున్న దళితులందరికీ దళిత బంధు ఇవ్వాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ దళిత బంధు ఇస్తామని ఆశచూపి బీఆర్‌ఎస్‌లో చేర్పించుకుంటున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలకే దళిత బంధు ఇస్తామని మంత్రి అంటున్నాడని, నిధులేమైనా మంత్రి ఇంట్లోంచి ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ దీనిపై విచారణ జరిపి పేద దళితులకు న్యాయం చేయాలన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగంతో అందరికీ న్యాయం అందడం లేదని, మేడ్చల్ నియోజకవర్గంలో రౌడీలు, మల్లారెడ్డి అనుచరులు రాజ్యమేలుతున్నారని అన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ దళిత బంధు అందజేసి మంత్రి తన నిజాయితీని నిరూపించుకోవాలని, లేని పక్షంలో అర్హులైన దళిత సోదరులతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

సీఎంఆర్‌సెట్ అధ్యాపకుడికి పీహెచ్‌డీ పట్టా



వెంకటయ్య

మేడ్చల్‌రూరల్: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాల అధ్యాపకుడికి జేఎన్‌టీయూహెచ్ పీహెచ్‌డీ పట్టా అందజేసింది. కళాశాల సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వాడాల వెంకటయ్య నోవెల్ ప్రిడిక్షన్ మోడల్స్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ కాస్ట్ ఎస్టిమేషన్ యూసింగ్ సాఫ్ట్ కంప్యూటింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై సమర్పించిన వ్యాసానికి జేఎన్‌టీయూహెచ్ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసినట్లు తెలిపారు. పట్టా పొందిన అధ్యాపకులు వెంకటయ్య కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

జీవితంలో రాణించాలంటే క్రమశిక్షణ అవసరం



ముఖ్యఅతిథి స్వామీజీతో అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్: విద్యార్థులు జీవితంలో రాణించాలంటే క్రమశిక్షణ ఎంతో అవసరమని, ఆత్మవిశ్వాసం వ్యక్తిత్వాన్ని పెంచే మరో ఆయుధమని రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై జరిగిన సదస్సుకు స్వామీజీ ముఖ్య అతిథి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. సీఎస్ఈ డీన్ విష్ణుమూర్తి, శ్రీదేవి, లింగమయ్య, రాధాకృష్ణయ్య, కిరణ్‌కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

- జీవో–59 ద్వారా నోటీసులు అందించాం
- మొత్తం డబ్బులు చెల్లించకుంటే కూల్చేస్తాం
- కాప్రా తహసీల్దార్ మతిన్



మాట్లాడుతున్న తహసీల్దార్ మతిన్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో జీవో–59 ద్వారా నోటీసులు అందుకున్న వారు డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కాప్రా మండల తహసీల్దార్ మతిన్ అన్నారు. బుధవారం తహసీల్దార్ మతిన్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్‌లోని తహసీల్దార్ మీటింగ్ హాలులో జీవో–59పై ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కమిషనర్ రామలింగంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. జీవో–59 ద్వారా అర్హులైన వారికి నోటీసులు అందించామని మూడు విడతల్లో డబ్బులు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇప్పటికే సగం వరకు డబ్బులు చెల్లించారని, మిగిలినవారు డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. గడువులోపు చెల్లించకుంటే కూల్చివేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మీ, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంపత్‌కు ఇన్‌స్పైరింగ్ లీడర్ అవార్డు



సంపత్ కుమార్

పోచారం: నారపల్లిలో నివసిస్తున్న ఎస్.సంపత్ కుమార్‌కు 2023వ సంవత్సరానికిగాను ఇన్‌స్పైరింగ్ లీడర్ అవార్డును ముంబైకి చెందిన టైమ్స్ అప్లాడ్ సంస్థ అందజేసింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్, సాహిత్య విభాగంలో అవార్డుకు ఎంపికయ్యారు. ముంబైలో జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా ప్రముఖ క్రికెటర్ హర్భజన్ సింగ్, నేపథ్య గాయకుడు, పద్మభూషణ్ ఉదిత్ నారాయణ్, సినీ నటి రాఖీ సావంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి కమిటీలు ఏర్పాటు



నియామక పత్రాలను అందజేస్తున్న బీఆర్‌ఎస్ పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి

పోచారం: అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని భారత రాష్ట్ర సమితి పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడు మండడి సురేందర్‌రెడ్డి బూత్‌స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. పోచారంతో పాటు నారపల్లిలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో బూత్ కమిటీలో 10 మంది సభ్యులు ఉంటారన్నారు. బుధవారం జరిగిన సమావేశంలో 26 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, బీఆర్‌ఎస్ పోచారం మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగ్లళ్ల బాలేష్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, కౌన్సిలర్లు సుర్వి రవీందర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, నాయకులు మోటుపల్లి శ్రీనివాస్, అబ్బవతిని నర్సింహ, బద్దం జగన్మోహన్‌రెడ్డి, సామల బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

చర్లపల్లి నుంచి రాంపల్లి వరకు బాక్స్ డ్రైనేజీ

పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



బాక్స్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ 5వ వార్డులోని లోటస్ కాలనీలో హెచ్‌ఎండీఏ నిధులతో చేపడుతున్న బాక్స్ డ్రైనేజీ పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారం మున్సిపల్ పరిధిలో వరద నీటి కష్టాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు మంత్రి మల్లారెడ్డి చొరవతో చర్లపల్లి చెరువు నుంచి రాంపల్లి చౌరస్తా వరకు బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పనులు పూర్తయితే వరద నీటి కష్టాలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, కౌకుట్ల అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజ్ సమస్యకు పరిష్కారం



ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో లోఓల్టేజ్ సమస్య ఉందన్న స్థానికుల విన్నపం మేరకు సర్పంచ్ కావేరి బుధవారం స్పందించారు. ఏఈ సతీశ్‌కుమార్‌తో కలిసి 63 కేవీ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో నూతనంగా 100 కేవీ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. కార్యక్రమంలో మశ్చేంద రెడ్డి, జూనియర్ లైన్‌మెన్ పవన్, శివ, ఎలక్ట్రిషియన్లు బాలకృష్ణ, సురేశ్ పాల్గొన్నారు.

ఎదులాబాద్ ఇన్‌చార్జి సర్పంచ్‌గా లింగేశ్వర్‌రావు



లింగేశ్వర్‌రావును సన్మానిస్తూ..

ఘట్‌కేసర్: ఎదులాబాద్ గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్‌గా ఉప సర్పంచ్ ఉప్పు లింగేశ్వర్‌రావు బుధవారం బాధ్యత స్వీకరించారు. గత సర్పంచ్ కాలేరు సురేశ్ విధులు నిర్వర్తించడంలో విఫలమైనందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య సర్పంచ్ విధుల నుంచి ఆయనను తొలగించారు. లింగేశ్వర్‌రావు ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యత స్వీకరించారు. పలువురు నాయకులు ఆయనను శాలువాతో సత్కరించారు. వార్డు సభ్యుడు ఆంజనేయులు ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, బాల్‌రాజ్ ముదిరాజ్, మహేశ్‌ముదిరాజ్, లింగం పాల్గొన్నారు.

చెట్లు నరికిన వ్యక్తికి రూ.1.80 లక్షల జరిమానా

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులు, ప్రధాన రహదారిలో హరితహారంలో భాగంగా నాటిన చెట్లను నరికివేస్తే సదరు వ్యక్తిపై జరిమానా విధించడంతో పాటు చట్టరీత్యా కఠిన చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ హెచ్చరించారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ఎస్వీనగర్ సమీపంలో ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ ముందు ఉన్న చెట్లను ఎలాంటి అనుమతులు తీసుకోకుండా తొలగించిన షాపింగ్ కాంప్లెక్స్ యజమాని భగవాన్‌దాస్‌కు రూ.1.80 లక్షల జరిమానా విధించడంతో పాటు నగదును వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం కింద నాటిన మొక్కలను సంరక్షించాలే తప్ప తొలగించవద్దన్నారు. తప్పని సరిగా తొలగించాలనుకుంటే మున్సిపల్ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



కీసర: చీర్యాల గ్రామంలో శ్రీసీతారామంజనేయస్వామి సమేత శివాలయం ముందు మండప నిర్మాణ పనులతో పాటు, రూ.12 లక్షల నిధులతో చేపట్టనున్న శ్రీముత్యాలమ్మ దేవాలయ నిర్మాణ పనుల భూమిపూజ కార్యక్రమాలను బుధవారం గ్రామసర్పంచ్ తుంగ ధర్మేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సహకార సంఘం డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పుల్లగూర్ల శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన సంఘం నేతలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.